క్లుప్తంగా

నేడు తోడేరుకు మంత్రి కాకాణి రాక

పొదలకూరు : రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి మండలంలోని తోడేరు గ్రామానికి సోమవారం ఉదయం 11 గంటలకు వస్తారని ఎంపీడీఓ నగేష్‌కుమారి ఆదివారం తెలిపారు. గ్రామంలో వైఎస్సార్ హెల్త్‌క్లినిక్ భవనం, సీసీ డ్రెయిన్లను ప్రారంభిస్తారని చెప్పారు. ఎంపీఎఫ్‌సీ గోడౌన్ నిర్మాణానికి భూమిపూజ చేస్తారని తెలియజేశారు.

విశ్వకర్మ యోజనకు దరఖాస్తు చేసుకోవాలి



సంగం: కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పీఎం విశ్వకర్మ యోజనకు అర్హులైన విశ్వ బ్రాహ్మణులందరూ దరఖాస్తు చేసుకోవాలని జిల్లా విశ్వ బ్రాహ్మణ సంఘ అధ్యక్షుడు ఖజానా వెంకట శేషాచారి తెలిపారు. ఆదివారం సంగంలోని వెంకటేశ్వర కల్యాణ మండపంలో మండల స్థాయి విశ్వబ్రాహ్మణ సంఘ సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ విశ్వకర్మ యోజనలో 18 రకాల చేతి వృత్తుల్లో వడ్రంగి, స్వర్ణకార, కొలిమి, వెల్డింగ్, శిల్పకళ, టైలరింగ్ తదితరాలు ఉన్నాయని తెలిపారు. ఈ పథకం కింద నూతన సాంకేతికతపై శిక్షణ ఇస్తారని, శిక్షణ కాలంలో స్టైఫండ్ ఉంటుందని తెలిపారు. వ్యాపారాభివృద్ధికి ప్రభుత్వ ఆర్థిక సహాయం అందజేస్తారన్నారు. అనంతరం మండల నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా భీమవరం శివరామాచారి, ప్రధాన కార్యదర్శిగా పైడా కృష్ణయ్యాచారి, ఉపాధ్యక్షుడు బొల్లోపల్లి మాల్యాద్రాచారి, పలువురు సభ్యులు పాల్గొన్నారు.

గొర్రెల కాపరిని బెదిరించి..

వరికుంటపాడు: మండలంలోని విరువూరు శివారులో శనివారం అర్ధరాత్రి గుర్తుతెలియని వ్యక్తులు జీవాల కాపరిని బెదిరించి గొర్రెలను ఎత్తుకెళ్లేందుకు ప్రయత్నించారు. వివరాలు.. గ్రామానికి చెందిన బత్తల వెంకటరమణ జీవాలను మేపుకొంటూ జీవనం సాగిస్తున్నాడు. రోజులాగే శనివారం రాత్రి గ్రామ శివారులో జీవాలను ఉంచి అక్కడే కాపలాగా పడుకున్నాడు. అర్ధరాత్రి సమయంలో ముఖాలకు ముసుగులు ధరించిన కొంత మంది గుర్తుతెలియని వ్యక్తులు వెంకటరమణ దగ్గరకు వెళ్లి గొంతుపై కత్తి పెట్టి బెదిరించి అరవకుండా నోటికి గుడ్డకట్టారు. గొర్రెలను ఎత్తుకెళ్లేందుకు ప్రయత్నించారు. అదే సమయంలో పామూరు నుంచి విరువూరు వైపు బైక్‌లు వస్తుండడం గమనించి పరారయ్యారు. బాధితుడు వరికుంటపాడు పోలీసులకు సమాచారం అందించడంతో పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిసరాలను పరిశీలించారు. ఎవరూ లేకపోవడంతో అప్రమత్తంగా ఉండాలని యజమానికి సూచించారు.

సీపీఎం సీనియర్ నాయకుడికి మాతృవియోగం



లక్ష్మీకాంతమ్మ పార్థీవ దేహాన్ని ప్రభుత్వ వైద్య కళాశాలకు దానం చేస్తున్న దృశ్యం

నెల్లూరు(వీఆర్సీసెంటర్): సీపీఎం సీనియర్ నాయకుడు కటికాల వెంకటేశ్వర్లు తల్లి లక్ష్మీకాంతమ్మ(88) ఆదివారం మృతి చెందారు. ఆమె పార్థీ వ దేహాన్ని నెల్లూరు ఏసీ సుబ్బారెడ్డి ప్రభుత్వ వైద్య కళాశాలకు దానం చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా నాయకులు మాదాల వెంకటేశ్వర్లు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి వెంకటరామరాజు, నాయకులు చంద్రారెడ్డి, దయాకర్, అంకయ్య, బలరాం, తదితరులు పాల్గొన్నారు.

సీఎం సహాయనిధి చెక్కు అందజేత



నెల్లూరు (టౌన్): ఇటీవల రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందిన గూడూరుకు చెందిన ఇంటర్ విద్యార్థి శశాంక్ తండ్రి గిరిధర్‌సాయికుమార్‌కు రూ.4.50 లక్షల సీఎం సహాయనిధి చెక్కును నగరంలోని కృష్ణచైతన్య జూనియర్ కళాశాలలో ఎమ్మెల్సీ పీ చంద్రశేఖరరెడ్డి ఆదివారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన శశాంక్ రెండు నెలల పాటు ఆస్పత్రుల్లో చికిత్స పొందుతూ మృతి చెందాడని తెలిపారు. శశాంక్ కుటుంబాన్ని ఆదుకునేందుకు సీఎం సహాయనిధి ద్వారా సాయం అందజేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీతో పాటు సీఎంకు గిరిధర్‌సాయికుమార్ కృతజ్ఞతలు తెలిపారు.

టీటీడీ సౌజన్యంతో 60 ఆలయాల నిర్మాణం

- రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి



మాతమ్మ ఆలయానికి సంబంధించి శంకుస్థాపన పూజలో మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి

పొదలకూరు : తిరుమల–తిరుపతి దేవస్థానం(టీటీడీ) సౌజన్యంతో సర్వేపల్లి నియోజకవర్గంలోని ఎస్సీ, ఎస్టీ కాలనీల్లో 60 ఆలయాలను నిర్మించామని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి అన్నారు. పొదలకూరు మండలం నందివాయ ఎస్సీ కాలనీలో శ్రీవాణి ట్రస్ట్ ఆధ్వర్యంలో టీటీడీ నిధులు రూ.10 లక్షల అంచనాలతో మాతమ్మ దేవాలయ నిర్మాణానికి మంత్రి కాకాణి ఆదివారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో ఎక్కడ దేవాలయం నిర్మించుకుంటామన్నా నిధులు మంజూరు చేయించే బాధ్యత తనదని తెలిపారు. చిన్న పంచాయతీ నందివాయలో రూ.29 లక్షలతో సీసీరోడ్లు, రూ.20 లక్షలతో సైడ్‌డ్రెయిన్లు, రూ.17 లక్షలతో తాగునీటి సౌకర్యం కల్పించినట్లు తెలియజేశారు. రూ.1.41 కోట్లతో నందివాయ మీదుగా అమ్మవారిపాళెం గ్రామం వరకు తారురోడ్డును నిర్మించామని వెల్లడించారు. తాను జెడ్పీచైర్మన్‌గా ఉన్న సమయంలో నందివాయ రోడ్డు నిర్మించానని, తర్వాత వచ్చిన నాయకులు ఎవరూ ఈ రోడ్డు గురించి పట్టించుకోలేదన్నారు. తిరిగి మంత్రి హోదాలో రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు చేయించి పూర్తి చేయించినట్లు పేర్కొన్నారు. ఇన్ని పనులు చేసిన ఈ పంచాయతీలో ఒక్క ఓటు కూడా ఇతరులకు పడదనే నమ్మకం ఉందన్నారు.

సోమిరెడ్డికి గ్రామాల దారులు తెలుసా?

టీడీపీ నేత సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డికి మండలంలోని గ్రామాలకు దారులు తెలుసా అని మంత్రి కాకాణి ప్రశ్నించారు. టీడీపీ అధికారంలో ఉన్న ఐదేళ్లు పెత్తనం వెలగబెట్టిన సోమిరెడ్డి గ్రామాల పేర్లు కూడా చెప్పలేని స్థితిలో ఉన్నట్లు విమర్శించారు. నియోజకవర్గంలో ఏ గ్రామానికి ఏది అవసరమో తనకు బాగా తెలుసునని, దీనివల్లే ఇంత పెద్ద ఎత్తున అభివృద్ధి పనులు చేపట్టినట్లు వెల్లడించారు. ఎంతమంది ఎన్ని సమస్యలు సృష్టించాలని చూసినా అసైన్మెంట్ భూములను అందజేస్తామని స్పష్టం చేశారు. పేదలు సాగు చేసుకుంటున్న భూములకు సంపూర్ణ హక్కులను కల్పిస్తామని వెల్లడించారు. రెండు దశాబ్దాలుగా అసైన్మెంట్ భూములను సాగు చేసుకునే పేదలకు అమ్ముకునే హక్కు కల్పిస్తున్నట్లు తెలిపారు. నందివాయలో 24 మందికి 25 ఎకరాల భూమిని అందజేస్తామని, పేదలు సాగు చేసుకునే భూములను వారికే కేటాయిస్తామని పేర్కొన్నారు. అనంతరం స్వామిత్వ కింద గ్రామ సర్వే పూర్తి కావడంతో ఇళ్లకు సంబంధించిన హక్కు పత్రాలను మంత్రి కాకాణి గ్రామస్తులకు పంపిణీ చేశారు. మంత్రి వెంట తహసీల్దార్ కె.వీరవసంతరావు, హౌసింగ్ ఏఈ శివమోహన్, సొసైటీ చైర్మన్ గోగిరెడ్డి గోపాల్‌రెడ్డి, జెడ్పీటీసీ సభ్యురాలు తెనాలి నిర్మలమ్మ, ఎంపీటీసీ సుగుణ, సర్పంచ్ కలికి ప్రమీలమ్మ, వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు పెదమల్లు రమణారెడ్డి, జేసీఎస్ కన్వీనర్ బచ్చల సురేష్‌కుమార్‌రెడ్డి, నాయకులు ఎస్.శశిధర్‌రెడ్డి, చెంచురామయ్య, శ్రీనివాసులురెడ్డి, మోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నృత్య కళాకారులకు జ్ఞాపికల బహూకరణ



జ్ఞాపికలతో నృత్య కళాకారులు

కొడవలూరు : మండలంలోని గండవరం ఆదర్శనగర్‌లో నూతనంగా నిర్మించిన రామాలయాన్ని శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా శనివారం రాత్రి 'మీనాక్షి నృత్యాలయ ఆర్ట్స్ అకాడమి' ఆధ్వర్యంలో కూచిపూడి, భరత నాట్య ప్రదర్శనలిచ్చారు. ఇందులో చిన్నారుల అద్భుత నృత్య ప్రదర్శనకు నేతాజీ అభ్యుదయ సేవా సమితి ఆధ్వర్యంలో ఆదివారం జ్ఞాపికలు బహూకరించారు. వీటిని ఆ సమితి అధ్యక్షుడు కోవూరు వెంకీ చేతుల మీదుగా అందించారు.

రేపు కామాక్షితాయి హుండీ కానుకల లెక్కింపు

బుచ్చిరెడ్డిపాళెం రూరల్ : మండలంలోని జొన్నవాడలో వెలసిన మల్లికార్జున సమేత కామాక్షితాయి దేవస్థానంలో హుండీ కానుకల లెక్కింపు కార్యక్రమం మంగళవారం జరుగుతుందని ఆలయ చైర్మన్ పుట్టా లక్ష్మీసుబ్రహ్మణ్యం నాయుడు, ఈఓ గిరికృష్ణ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం తొమ్మిది గంటలకు లెక్కింపు కార్యక్రమం మొదలవుతుందని తెలియజేశారు.

మంత్రి కాకాణితో కలెక్టర్, జేసీ భేటీ



నెల్లూరు(దర్గామిట్ట): రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డితో నగరంలోని ఆయన నివాసంలో కలెక్టర్ ఎం హరినారాయణన్, జాయింట్ కలెక్టర్ రోణంకి కూర్మనాథ్ ఆదివారం భేటీ అయ్యారు. జిల్లాలోని పలు అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా జిల్లాలోని పరిస్థితులపై మంత్రి ఆరా తీశారు.

మర్యాదపూర్వకంగా...



నెల్లూరు(లీగల్): ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్ సుదర్శన్‌రెడ్డి, రాష్ట్ర హైకోర్టు పబ్లిక్ ప్రాసిక్యూటర్ నాగిరెడ్డి ఆదివారం నెల్లూరుకు విచ్చేశారు. ఈ సందర్భంగా వారిని నగరంలోని ఓ హోటల్‌లో వైఎస్సార్‌సీపీ లీగల్ సెల్ జిల్లా అధ్యక్షుడు మురళీధర్‌రెడ్డి, నెల్లూరు మున్సిపల్ కార్పొరేషన్ స్టాండింగ్ కౌన్సిల్ రంగారావు, మాజీ ఏపీపీ కుడుమల రవికుమార్‌తో పాటు పలువురు లీగల్ సెల్ న్యాయవాదులు మర్యాదపూర్వకంగా కలిశారు. వారిని శాలువాలతో సత్కరించి అభినందనలు తెలిపారు.

'చెకుముకి సైన్స్' పోస్టర్ ఆవిష్కరణ

కావలి: పట్టణ జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో 'చెకుముకి సైన్స్' సంబరాలు 2023–24 పోస్టర్‌ను స్థానిక రవి నర్సింగ్ హోమ్‌లో ఆదివారం ఆవిష్కరించారు. అనంతరం పట్టణ జేవీవీ అధ్యక్షుడు తోట వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో విస్తృత కార్యవర్గ సమావేశం నిర్వహించారు. గౌరవాధ్యక్షుడు డాక్టర్ బెజవాడ రవికుమార్ మాట్లాడుతూ విద్యార్థుల్లో సైన్స్‌పై ఆసక్తిని పెంపొందించేందుకు చెకుముకి సంబరాలు దోహదం చేస్తాయన్నారు. విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించడానికి జేవీవీ కృషి చేస్తోందన్నారు. తోట వెంకటేశ్వర్లు మాట్లాడుతూ చెకుముకి సైన్స్ సంబరాలను నాలుగు స్థాయిల్లో నిర్వహిస్తున్నారని తెలిపారు. నవంబర్ 10న పాఠశాల, 30 మండల/పట్టణ, డిసెంబర్ 17న జిల్లా, జనవరి 27, 28 తేదీల్లో రాష్ట్రస్థాయిలో పోటీలు జరుగుతాయని వివరించారు.

ఉచిత కంటి వైద్యశిబిరం



నెల్లూరు సిటీ: జిల్లా రెడ్‌క్రాస్ సొసైటీ చైర్మన్, ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి ఆదేశాల మేరకు నగరంలోని చింతారెడ్డిపాళెంలోని అలహరినగర్‌లో ఆదివారం ఉచిత కంటి వైద్యశిబిరం నిర్వహించారు. రెడ్‌క్రాస్ జనరిక్ మెడికల్ షాపు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ శిబిరంలో కంటి సమస్యలతో బాధపడుతున్న వారికి ఉచితంగా వైద్యపరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. ఈ సందర్భంగా 20 మంది స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఎల్వీ ప్రసాద్ ఐ ఇన్‌స్టిట్యూట్ వైద్యులు కిరణ్, అనూష పాల్గొన్నారు.

అయ్యప్పస్వామికి పడి పూజ



విడవలూరు : మండలంలోని తుమ్మగుంట గ్రామంలో ఉన్న అయ్యప్పస్వామి ఆలయంలో ఆదివారం పడి పూజ నిర్వహించారు. తొలుత ఆలయ అర్చకుడు చంద్రశేఖర్‌శర్మ స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మణికంఠ సేవా సమితి ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున భజన, పడిపూజ కార్యక్రమాలు జరిపారు. జిల్లా నలుమూలల నుంచి అధిక సంఖ్యలో అయ్యప్ప భక్తులు విచ్చేసి భజనలో పాల్గొన్నారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. సోమిశెట్టి కృష్ణ –సుచిత్ర దంపతులు ఉభయకర్తలుగా వ్యవహరించారు.

అమ్మవారిపాళెం రోడ్డు నిర్మాణం పూర్తి



నిర్మాణం పూర్తయిన అమ్మవారిపాళెం రోడ్డు

పొదలకూరు : గత పాలకుల నిర్లక్ష్యం వల్ల పూర్తిగా దెబ్బతిన్న నావూరు రహదారి నిర్మాణానికి రెండు మార్గాల ద్వారా మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి మొత్తం రూ.11.41 కోట్ల నిధులు మంజూరు చేయించారు. దీంతో ఎంతో కాలంగా నావూరు రోడ్డు దెబ్బతిని ఇబ్బందులు పడుతున్న ప్రయాణికులకు మోక్షం కలగనుంది. పీఆర్ ప్రాజెక్టు కింద పొదలకూరు–సంగం మెయిన్ రోడ్డు నుంచి అయ్యగారిపాళెం, నందివాయ, అమ్మవారిపాళెం బస్ షెల్టర్(కూడలి) వరకు ఏడు కిలోమీటర్ల రోడ్డుకు రూ.1.41 కోట్లతో నిర్మాణ పనులను ప్రారంభించి శరవేగంగా పూర్తి చేశారు. సంగం–పొదలకూరు మెయిన్ రోడ్డు(మరో మార్గం) నుంచి ప్రభగిరిపట్నం, నావూరుపల్లి, నావూరు, చెన్నారెడ్డిపల్లి, చేజర్ల మండలం కొండలరాయుడు కండ్రిక వరకు 20 కిలోమీటర్ల వరకు పీఎంజీఎస్‌వై కింద రూ.10 కోట్లు మంజూరు చేశారు. ఈ రోడ్డు పనులను కూడా ప్రారంభించి త్వరలో పూర్తి చేసేందుకు అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. అమ్మవారిపాళెం రోడ్డుకు రూ.1.41 కోట్లను మంత్రి కాకాణి మార్కెటింగ్‌శాఖ ద్వారా నిధులను విడుదల చేయించారని పీఆర్ ప్రాజెక్ట్ ఏఈ మవేక్‌రెడ్డి వెల్లడించారు. ఈ రోడ్డు దెబ్బతిని గుంతలమయం కావడం వల్ల ప్రయాణికులు నిత్యం ఇబ్బందులు పడేవారు. ఇప్పుడు సుఖవంతమైన ప్రయాణం సాగిస్తూ మంత్రి కాకాణికి కృతజ్ఞతలు తెలుపుతున్నారు.

చౌకచర్లలో నేత్రదానం



నేత్రదానం చేసిన జయపాల్

విడవలూరు : మండలంలోని చౌకచర్ల గ్రామంలో గరితోటి జయపాల్ (66) శనివారం రాత్రి ఆకస్మికంగా మృతిచెందగా, ఆయన నేత్రాలను కుటుంబసభ్యులు ఆదివారం దానం చేశారు. గ్రామానికి చెందిన జయపాల్ సీఐఎస్‌ఎఫ్‌లో ఎస్సైగా చేసి రిటైరయ్యారు. కాగా ఆయన శనివారం రాత్రి మృతిచెందాడు. జయపాల్ కోరిక మేరకు ఆయన నేత్రాలను కుటుంబ సభ్యులు విడవలూరుకు చెందిన మనసేవ సంస్థ ఆధ్వర్యంలో దానం చేశారు. కార్యక్రమంలో టెక్నీషియన్ వేణు, మనసేవ సంస్థ నిర్వాహకుడు దేవళ్ల శ్రీనివాసులురెడ్డి పాల్గొన్నారు.

అర్హులందరూ ఓటు నమోదు చేసుకోండి



ఓట్ల నమోదును పరిశీలిస్తున్న తహసీల్దార్

మనుబోలు : అర్హులైన ప్రతిఒక్కరూ ఓటు హక్కు కోసం నమోదు చేసుకోవాలని తహసీల్దార్ శివకృష్ణయ్య సూచించారు. మండలంలోని కొలనకుదురు గ్రామంలో ఏర్పాటు చేసిన పోలింగ్ వెరిఫికేషన్ కేంద్రాన్ని ఆదివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 2024 జనవరి 1వ తేదీ నాటికి 18 ఏళ్లు నిండే వాళ్లందరూ కొత్తగా ఓటు హక్కు కోసం నమోదు చేసుకోవచ్చన్నారు. డిసెంబర్ 9వ తేదీకి ఓటరు నమోదు ప్రక్రియ ముగుస్తుందన్నారు. ఓటుకు సంబంధించి మార్పులు, చేర్పులు ఉంటే బీఎల్‌ఎల వద్ద నమోదు చేసుకోవాలని సూచించారు. ఆయన వెంట బీఎల్‌ఓలు నాగేశ్వరరావు, శేషసాయికుమార్‌రెడ్డి, తిరుమలకుమార్, మాధవి, శ్రీహరి, శ్రావ్య, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

దేవాంగుల అభివృద్ధికి ప్రత్యేక కృషి



సన్మానం అందుకున్న మల్లికార్జున

కోవూరు : దేవాంగ కులస్తుల అభివృద్ధికి ప్రత్యేక కృషి చేస్తానని ఆలిండియా చేనేత సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు భువనగిరి మల్లికార్జున తెలిపారు. కోవూరుకు చెందిన మల్లికార్జునను ఆ సంఘ జిల్లా అధ్యక్షుడిగా ఎంపిక చేసిన నేపథ్యంలో మండల కేంద్రంలోని చేనేత సంఘ కార్యాలయంలో మల్లికార్జునకు ఆదివారం సన్మాన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా ఉన్న దేవాంగుల కులస్తులతో కలిసి పనిచేస్తానన్నారు. అందుకు జిల్లా దేవాంగ సంక్షేమ సంఘం వారి సహాయ సహకారాలు ఉండాలని కోరారు. ఇప్పటికే తమ సంఘం ద్వారా అనేక సామాజిక సేవా కార్యక్రమాలను చేపడుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో దేవాంగ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఎం.సతీష్, అసోసియేషన్ అధ్యక్షుడు ఎస్.వెంకటసురేష్, గౌరవాధ్యక్షుడు పి.నాగేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి పి.శంకరయ్య, కోశాధికారి కె.మాధవయ్య, కార్యవర్గ సభ్యులు ఉన్నారు.

సాహిత్యాన్ని, కవులను ఆదరించాలి



కవిత కుసుమాల పుస్తకావిష్కరణ

నెల్లూరు(మినీబైపాస్): సాహిత్యాన్ని, కవులను ఆదరించాలని నారాయణ దంత వైద్యశాల హెచ్‌ఓడీ డాక్టర్ ఎస్ కన్నన్ అన్నారు. పురమందిర ప్రాంగణంలోని వర్ధమాన సమాజం హాల్లో నెల్లూరు జిల్లా రచయితల సంఘం ఆధ్వర్యంలో సోడే గీతాంజలి రచించిన కవిత కుసుమాలు పుస్తకావిష్కరణ కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి డాక్టర్ ఎస్ కన్నన్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. సమాజంలోని సమస్యలను తెలియజేసి ప్రజల్లో చైతన్యం కలిగించేది, సమాజానికి దిశా నిర్దేశం చేసేది సాహిత్యమేనని పేర్కొన్నారు.నేటి యువత సాహిత్యంపై ఆసక్తి చూపకపోవడం దురదృష్టకరమని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం రచయిత్రి సోడే గీతాంజలిని ఘనంగా సన్మానించారు. కవి సమ్మేళనం నిర్వహించి కవులను సత్కరించారు. నెల్లూరు జిల్లా రచయితల సంఘం ప్రధాన కార్యదర్శి డాక్టర్ పాతూరి అన్నపూర్ణ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో సర్వేపల్లి రామ్మూర్తి గంగిశెట్టి శివకుమార్, అరుణ, తదితరులు పాల్గొన్నారు.

సత్ప్రవర్తనతో మెలగాలి



మాట్లాడుతున్న ఎస్సై రంగనాథ్‌గౌడ్

కోవూరు : తప్పు చేసిన వారిలో మార్పు రావాలని, సత్ప్రవర్తనతో మెలగాలని ఎస్సై రంగనాథ్‌గౌడ్ అన్నారు. కోవూరు మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్ ప్రాంగణంలో రౌడీషీటర్లకు ఆదివారం కౌన్సిలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా వారికి పలు సూచనలు చేశారు. రౌడీల్లో పరివర్తన రావాలని సూచించారు. లేకుంటే అనేక ఇబ్బందులు ఎదుర్కోవాల్సి ఉంటుందని హెచ్చరించారు. కుటుంబాలతో కలిసి మెలసి జీవించాలని ఆకాంక్షించారు.

మూగజీవాల అపహరణ



అపహరణకు గురైన గేదెలు

బుచ్చిరెడ్డిపాళెం రూరల్ : మండలంలోని జొన్నవాడ హరిజనవాడలో నావూరు హరిబాబుకు చెందిన రెండు గేదెలు, ఒక దూడను గుర్తు తెలియని వ్యక్తులు ఆదివారం తెల్లవారుజామున అపహరించారు. ఈ విషయమై బాధితులు ఆదివారం బుచ్చిరెడ్డిపాళెం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. తమకు జీవనాధారమైన రూ.2 లక్షల విలువైన గేదెలను దొంగలు ఎత్తుకెళ్లారని, తమకు న్యాయం చేయాలని బాధితులు కోరారు. దీనిపై దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

యువకుడి ఆత్మహత్య

బుచ్చిరెడ్డిపాళెం రూరల్ : మండలంలోని పెనుబల్లి గ్రామంలో ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన ఆదివారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. కొడవలూరు మండలం యల్లాయపాళెం గ్రామానికి చెందిన గడ్డం సురేష్ (27) పెయింటింగ్ పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. కాగా బుచ్చిరెడ్డిపాళెం మండలం పెనుబల్లికి చెందిన హరితతో సురేష్‌కు కొన్నేళ్ల క్రితం వివాహం జరిగింది. వీరికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. అయితే గత కొంత కాలంగా సురేష్ తరచూ మద్యం తాగేవాడు. దీంతో మద్యం మానేయాలని భార్య తరచూ కోరేది. భర్త ఎంతకూ మద్యం మానకపోవడంతో వారం రోజుల క్రితం హరిత తన పుట్టిల్లు పెనుబల్లికి వచ్చింది. దీంతో భర్త కూడా అప్పటి నుంచి భార్యతోనే ఉంటున్నాడు. కాగా ఆదివారం ఉదయం 11:30 సమయంలో ఇంట్లో ఎవరూ లేకపోవడం చూసి చీరను సీలింగ్‌కు తగిలించి ఉరి వేసుకున్నాడు. మృతుడి తండ్రి మాధవయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని బుచ్చిరెడ్డిపాళెం ఎస్సై మహేంద్ర తెలిపారు.

కళాకారుడికి సన్మానం



నెల్లూరు(మినీబైపాస్): గాంధీబొమ్మ సమీపంలోని 25 కళాసంఘాల చాంబర్‌లో ప్రముఖ మేకప్ కళాకారుడు వనారస లక్ష్మీకాంత్‌బాబును 25 కళా సంఘాల అధ్యక్షుడు అమరావతి కృష్ణారెడ్డి ఆదివారం ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా అమరావతి కృష్ణారెడ్డి మాట్లాడుతూ లక్ష్మీకాంత్ బాబు ఇటీవల మలేషియాలో రేకాన్ ఇంటర్నేషనల్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో తిరుమల తిరుపతి దేవస్థానం నేతృత్వంలో ప్రదర్శించిన శ్రీనివాస కల్యాణం నృత్య రూపకంలో పాల్గొన్న కళాకారులకు అద్భుతంగా మేకప్ వేసి మలేషియావాసుల అభినందనలు పొందారని తెలిపారు. ఆయన నెల్లూరుకు తిరిగి విచ్చిన సందర్భంగా సత్కరించామని చెప్పారు. హాస్యనటుడు దోర్నాల హరిబాబు మాట్లాడుతూ ప్రముఖ సీనియర్ రంగస్థల నటులు పొన్నాల రామసుబ్బారెడ్డి వంటి నటులకు మేకప్ చేసిన ఘనత లక్ష్మీకాంత్ బాబుది అని కొనియాడారు. మేకప్ కళాకారుడు లక్ష్మీకాంత్‌బాబు మాట్లాడుతూ సీనియర్ మేకప్ కళాకారులు షరీఫ్, ప్రసాద్, రాజా, సుధాకర్‌రెడ్డి, అస్లాం, అల్లాబక్షు, సురభి మేకప్ కళాకరులు, తదితరుల ప్రోత్సాహంతో తాను ఎదిగానని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ చిత్రకారుడు అమీర్‌జాన్, శ్రీద్వారకామాయి వృద్ధాశ్రమ నిర్వాహకుడు నేదురుమల్లి హరినాధరెడ్డి తదితరులు పాల్గొన్నారు.